క్లుప్తంగా

ముమ్మరంగా విద్యుత్ లైన్ల పునరుద్ధరణ



పాన్‌గల్: మండలంలో గురువారం వీచిన ఈదురు గాలులకు నెలకొరిగిన విద్యుత్ స్తంభాలు, లైన్ల పునరుద్ధరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని వెంగళాయిపల్లి, జమ్మాపూర్, బండపల్లి, కేతేపల్లి, కదిరెపాడు తదితర గ్రామాల్లో శనివారం విద్యుత్ పునరుద్ధరణ పనులు కొనసాగాయి. ఆయా గ్రామాల్లో రెండ్రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు త్వరగా పూర్తిచేసి సరఫరా ప్రారంభించాలని కోరుతున్నారు.

నెరవేరని రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు : సీపీఎం



వీపనగండ్ల: ఎందరో ఆత్మబలిదానాలతో సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నేటికీ నెరవేరలేదని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం చెలాయిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులు, నిరుద్యోగులు, ప్రజా అవసరాలను విస్మరించి ఏకపక్ష పాలన కొనసాగిస్తోందని మండిపడ్డారు. ధరణి సమస్యలతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయకపోవడం, అకాల వర్షాలకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు, నియామకాలు, ఆత్మగౌరవం పేరుతో అధికారంలోకి వచ్చిన నాయకులు తెలంగాణ ప్రజలను అడుగడుగునా మోసం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌పాషా, మురళి, సంగినేనిపల్లి సర్పంచ్ మౌలాలి, ఈశ్వర్, నాగరాజు, రామచంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ప్రత్యేక పూజలు



ఖిల్లాఘనపురం: మండలంలోని సల్కెలాపురం గ్రామంలో జరిగిన కోట మైసమ్మ ఉత్సవాల్లో శనివారం మాజీ మంత్రి చిన్నారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో గ్రామదేవతల ఉత్సవాలను ప్రజలు సంతోషంగా జరుపుకొంటున్నారని తెలిపారు. ఆయనవెంట తనయుడు ఆదిత్యారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మండల అధ్యక్షుడు విజయ్ కుమార్, రమేష్, మల్లేష్, కృష్ణయ్య, బాలరాజు, దేవిజానాయక్, దేవన్న, సత్యారెడ్డి, జయాకర్, నవీన్‌రెడ్డి ముదిరాజ్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రహెమానియా మసీద్ కార్యవర్గం ఎన్నిక

అమరచింత: పట్టణంలోని రహెమానియా మసీద్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు ఏబీ నిసార్ తెలిపారు. కొన్నిరోజుల కిందట వ్యక్తిగత కారణాలతో కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, కోశాధికారితో పాటు నలుగురు సభ్యులు రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైందన్నారు. ప్రస్తుతం కార్యదర్శిగా ఎండీ నబీ, సంయుక్త కార్యదర్శిగా ఎస్.ఆలీ, ఉపాధ్యక్షులుగా సయ్యద్ కలాంపాషా, ఎండీ ఖాజాపాషా, కోశాధికారులుగా అబ్దుల్ ఫయాజ్, నసీరుద్దీన్, కమిటీ సభ్యులను పెద్దల సమక్షంలో ఎన్నుకున్నట్లు వివరించారు.

పాఠశాలపై చర్యకు డిమాండ్

వనపర్తిటౌన్: వేసవి సెలవులకు ముందే పాఠశాల తెరిచి పాఠ్య పుస్తకాలు విక్రయించడంతో పాటు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న శ్రీచైతన్య హైస్కూల్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం విద్యార్థి సంఘాల నాయకులు జిల్లాకేంద్రంలో జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠ్య పుస్తకాలు అయిపోతున్నాయని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెబుతున్నారని, దీంతో తల్లిదండ్రులు యాజమాన్యం చెప్పిన ధరకే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఫీజులు కూడా రూ. వేలల్లో దండుకుంటున్నారని, సామాన్య విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు ఎలా చెల్లించగలరని వాపోయారు. వినతిపత్రం అందజేసిన వారిలో విద్యార్థి సంఘాల నాయకులు రాము, భరత్, రాము, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన రైతు సంబరాలు



తాటిపాముల నుంచి ఎద్దులబండ్లపై వస్తున్న రైతులు



ఆత్మకూర్ మండలం ఆరేపల్లిలో ట్రాక్టర్ల ఊరేగింపు..



పెద్దమందడిలో మాట్లాడుతున్న జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి



పాంరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న డీపీఓ సురేష్‌కుమార్



పాన్‌గల్ మండలం రేమద్దులలో బొడ్డెమ్మలు వేస్తున్న మహిళలు

కొత్తకోట రూరల్: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని రైతు సంక్షేమ పథకాలు తెలంగాణాలో కొనసాగుతున్నాయని.. రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం పెద్దమందడి మండలంలోని ఆరు క్లస్టర్ల పరిధిలో రైతు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పెద్దమందడి క్లస్టర్ పరిధిలోని రైతులు ఎద్దులబండ్లతో పెద్దఎత్తున తరలివచ్చి మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో ఊరేగింపు చేపట్టారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో పాలమూరులోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు మంత్రి నిరంజన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్య, ఎంపీడీఓ అఫ్జల్, జెడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

అమరచింత: రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని మండల ప్రత్యేక అధికారి, డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లి రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా నందిమళ్లలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ డా. చుక్క మాలతి, నాగల్‌కడ్మూర్ కార్యక్రమానికి వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు జయసింహారెడ్డి, మండల అధ్యక్షుడు చుక్క ఆశిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు శిల్పా శంకర్‌నాయక్, బండి పావని, వెంకటన్న, రాజేశ్వరి, చుక్క మణెమ్మ, రామలింగమ్మ, చెన్నమ్మ, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



పెబ్బేరులో..

ఘనంగా రైతు దినోత్సవం..

చిన్నంబావి: రైతులు, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటరమణమ్మ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని పెద్దమారూర్‌లో సర్పంచ్ గోవిందు శ్రీధర్‌రెడ్డి, అయ్యవారిపల్లిలో సర్పంచ్ రామస్వామి, కాలూరులో సర్పంచ్ యశోదమ్మ తిరుపాల్, కొప్పునూరులో సర్పంచ్ నంది రాజేశ్వర్‌రెడ్డి, వెలగొండలో సర్పంచ్ శివమ్మ, బెక్కంలో సర్పంచ్ పద్మ ఆధ్వర్యంలో రైతు సంబరాలు నిర్వహించారు. తహసీల్దార్ ఘన్సీరాం నాయక్, ఎంపీడీఓ రవినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాల గురించి వివరించారు.

రైతు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం..

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, రేమద్దుల, దొండాయిపల్లి, మల్లాయిపల్లిలోని రైతువేదికల్లో రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లను



గోపాల్‌పేటలో..

కొబ్బరి, మామిడి తోరణలతో అందంగా అలంకరించి ఊరేగించారు. ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాముయాదవ్, పీఆర్ ఈఈ మల్లయ్య, తహసీల్దార్ చక్రపాణి, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, ఏపీఎం సక్రూనాయక్, పీఆర్ డీఈ చెన్నయ్య, ఏఈ సత్తయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణాలో రైతులే రాజులు..

ఆత్మకూర్: మండలంలోని ఆరేపల్లి, మూలమళ్ల, జూరాల రైతువేదికల్లో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దులబండ్లతో ఊరేగింపు చేపట్టి కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కోటేష్, జెడ్పీటీసీ సభ్యురాలు శివరంజని, విండో అధ్యక్షులు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవియాదవ్, ప్రత్యేక అధికారి అనీల్‌ప్రకాష్‌కిరణ్, డీపీఓ సురేష్, తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్ సింగ్, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ నర్సింగ్‌రావు, ఏపీఎం శ్రీనివాసులు, ఏఓ వినయ్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు సంబరాలు..

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట, బొల్లారం, కల్వరాల, గోపల్‌దిన్నె, పుల్గర్‌చర్లలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు భారీ ర్యాలీ నిర్వహించి రైతువేదికల్లో జరిగిన రైతు సంబరాల్లో పాల్గొన్నారు. ఎంపీపీ కమలేశ్వర్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు మాధురికిరణ్, సింగిల్‌విండో అధ్యక్షుడు రామన్‌గౌడ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, సర్పంచ్‌లు ఎద్దుల అరుణమ్మ, పద్మ, విజయ్‌కుమార్, రఘునాథ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సీనియర్ నాయకులు మల్లయ్యయాదవ్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు వేడుకలు..

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంతో పాటు వెంకటాపురం, కంబాళాపురంలోని రైతువేదికల్లో జరిగిన రైతు దినోత్సవాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, ఎంపీపీ గాయత్రి, సర్పంచులు వినీలారాణి, సత్యనారాయణయాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, మంజుల, నిర్మల, ఆంజనేయులు, నాగన్న, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

'ఖిల్లా'లో..

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, పర్వతాపురం, ఖిల్లాఘనపురం, సోళీపురం, మానాజీపేట, కమాలోద్దీన్‌పూర్‌లోని రైతువేదికల్లో రైతులతో సమావేశం నిర్వహించి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు.

పండుగలా రైతు దినోత్సవం..

గోపాల్‌పేట: స్థానిక బస్టాండ్ ఆవరణ నుంచి ఏదుట్ల రైతువేదిక వరకు రైతులు ఎద్దులబండ్లు, ట్రాక్టర్లలో తరలివచ్చారు. రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, సర్పంచ్ శ్రీనివాసులు, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం..

పెబ్బేరు: మండల పరిధిలోని రైతువేదికల్లో రైతు దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ఆవుల శైలజ, రైతు సమితి అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటస్వామి, వెంకటేష్, గోవిందునాయుడు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ప్రత్యేక అధికారి జగన్మోహన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో..



సోళీపురంలో రైతులతో కలిసి ర్యాలీగా వస్తున్న సర్పంచ్ దంపతులు



అయ్యవారిపల్లిలో..

రహదారి నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదు



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ, పుర కమిషనర్

అమరచింత: సీసీ రహదారుల నిర్మాణంతో కాలనీలో కొత్తశోభ సంతరించుకుంటుందని.. పనులు అడ్డుకోవడం సరికాదని ఎస్‌ఐ శివనాగేశ్వరనాయుడు, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా అన్నారు. శనివారం పట్టణంలోని నాలుగో వార్డులో సీసీ రహదారి నిర్మాణానికి వెళ్లిన కాంట్రాక్టర్‌తో కొందరు ఘర్షణకు దిగి పనులు అడ్డుకున్నారు. దీంతో అక్కడికి చేరుకున్న కమిషనర్, ఎస్‌ఐ కాలనీవాసులతో మాట్లాడి పనులు పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీల్లో అంతర్గత రహదారుల నిర్మాణాలకుగాను సీఎం అస్యూరెన్స్ నిధులు రూ.50 లక్షలు మంజూరయ్యాయని, వీటితో నాలుగు, అయిదో వార్డులో పనులు చేపడుతున్నట్లు వివరించారు. పట్టణంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సింధు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవం.. వేంకటేశ్వరుడి కల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణానికి హాజరైన భక్తులు

అమరచింత: పట్టణంలోని బీసీకాలనీలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వేదపండితుడు బ్రహ్మశ్రీ కొల్లూరు భీమాచార్యుల ఆధ్వర్యంలో బ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయస్వామి బృందం వేదమంత్రోచ్చారణల నడుమ కార్యక్రమం కొనసాగింది. తెల్లవారుజామున స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పంచామృత అభిషేకం, హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తుల సమక్షంలో కల్యాణం జరిపించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యక్రమ నిర్వాహకుడు డా. ఉత్తరాపల్లి రామాచార్యులు పాల్గొని స్వామివారి లీలలను వివరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టణ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పారుపల్లి చింతన్న, పొబ్బతి వెంకటస్వామి, డా. సీతారాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'రైతు వ్యతిరేఖ ప్రభుత్వాన్ని సాగనంపుదాం'



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మదనాపురం: రాష్ట్రంలో రైతు వ్యతిరేఖ పాలన సాగుతుందని.. తొమ్మిదేళ్ల పాలనలో రైతులకు ఏం ప్రయోజనం చేకూర్చి రైతు దినోత్సవం నిర్వహిస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం మండలంలోని దంతనూరులో నిర్వహించిన రైతు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రోజుల తరబడి పడిగాపులు పడుతున్నా కొనే నాథుడే కరువయ్యాడని.. కొనుగోలు చేసిన ధాన్యంలోనూ తరుగు పేరుతో దోచుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చే హామీలు నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల ప్రధానకార్యదర్శి జగదీశ్, కిసాన్‌సెల్ నాయకులు నాగన్న, దంతనూర్ ఎంపీటీసీ మాజీ సభ్యులు బాలయ్య, గుగ్గిల రాములు, అన్నం బాల్‌రెడ్డి, గొల్ల నర్సింహయాదవ్, కురుమూర్తి, సాయిలు, కృష్ణయ్య, వెంకటన్న, మహిళా రైతులు మణెమ్మ, సుందరమ్మ, వెంకటమ్మ, గోవిందమ్మ, సుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో కార్పొరేట్ విద్య

- మన ఊరు–మన బడితో మారిన రూపురేఖలు
- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మదనాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం: సర్కారు బడుల్లో కార్పొరేట్‌స్థాయి విద్య అందుతుందని.. మన ఊరు–మన బడితో పాఠశాలల రూపురేఖలు మారాయని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మదనాపురం, అజ్జకొల్లు, కొన్నూరు రైతువేదికల్లో నిర్వహించిన రైతుదినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత చదువులు చదివిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తారని, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చేర్పించాలని కోరారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. కేంద్రంలోని మోదీ పాలనలో డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ సిలిండర్ ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు రాంనారాయణ, బ్రహ్మమ్మ, జగన్, టీఆర్‌ఎస్ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు జయంతి, జెడ్పీటీసీ కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ శ్రావణ్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు హనుమాన్‌రావు, జిల్లా సభ్యులు రవీందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు యాదగిరి, టీసీ నాగన్న, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని.. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని రేమద్దుల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లత అన్నారు. బడిబాటలో భాగంగా శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఇల్లిల్లూ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత పుస్తకాలు, దుస్తులు, భోజనం, రాత పుస్తకాలు ఉచితంగా అందిస్తారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సాధించిన ఫలితాలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



పెబ్బేరు మండలంలో..

పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

చిన్నంబావి: సర్కారు బడుల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా జూన్‌లో ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా శనివారం మండలంలోని బెక్కెంలో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. ఉపాధ్యాయులు బడిఈడు పిల్లలు, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, విద్య, ఉచిత భోజనం, పుస్తకాల గురించి వివరించి పాఠశాలల్లో చేర్పించేలా అవగాహన కల్పించారు.

'బడిబాట'ను ప్రారంభించిన జిల్లా నోడల్ అధికారి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం, జానంపేటలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి వరలక్ష్మి ప్రారంభించారు. ఉపాధ్యాయులతో కలిసి ఇల్లిల్లూ తిరిగారు. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం కొనసాగుతుందని, ప్రైవేట్‌కు దీటుగా వసతులు కల్పిస్తున్నామని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భరత్‌కుమార్, సత్యనారాయణ, నాగమణి, శ్వేత, మోహన్‌గౌడ్, తిమ్మప్ప, శ్రీనివాస్‌రెడ్డి, విద్యాకమిటి చైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య..

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల, అమ్మపల్లిలో శనివారం ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇల్లిల్లూ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని.. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు. బడిఈడు, బడిబయటి పిల్లలను పాఠశాలలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రణధీర్, వెంకటస్వామి, రాజేంద్రబాబు, గద్వాల కృష్ణ, చంద్రుడు, పీఈటీ జయసింహారెడ్డి, రికార్డు అసిస్టెంట్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాట ర్యాలీ..

పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల విద్యాధికారి జయరాములు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంతో అన్ని సౌకర్యాలు ఉంటాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.



రేమద్దులలో బడిబాట ర్యాలీ



బెక్కెంలో..



అమ్మపల్లిలో..